# నమస్తే తెలంగాణ

# భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, బుధవారం 23 ఏప్రిల్ 2025 | BHADRADRI KOTHAGUDEM


# ఊరూ వాడా ఎల్కతుర్తి బాట పట్టాలి

**బుర్హాన్‌పురం సన్నాహక సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**



జై తెలంగాణ నినాదాలు చేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరూ వాడా ఎల్కతుర్తి బాట పట్టాలని డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురం 51వ డివిజన్‌లో ముఖ్య నాయకులతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాలను ఆదుకున్నారని, అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ప్రజలు విసిగిపోయారని, మళ్లీ కేసీఆర్ పాలనే కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ సభకు ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. జై తెలంగాణ.. జైజై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు వీరభద్రం, 51వ డివిజన్ కార్పొరేటర్ రమాదేవి, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కరించాలి

**కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర**



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఖమ్మం, ఏప్రిల్ 22: జిల్లా రైతాంగం వివిధ రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్‌ను కలిసి రైతుల ప్రధాన సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సత్తుపల్లి నియోజకవర్గంలో ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలో గృహలక్ష్మి లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని విన్నవించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చూడాలని, 1638 సన్నరకం ధాన్యం కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. వారి వెంట పెనుబల్లి మండల పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకటరావు, మోహన్‌రావు, అశోక్, మలీదు వెంకన్న, ఆసిఫ్ పాషా తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బంది పెట్టొద్దు

**మేడేపల్లి సొసైటీ, ఐకేపీ కేంద్రాల తనిఖీలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ముదిగొండ, ఏప్రిల్ 22: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందిపెట్టొద్దని, కొర్రీలతో మిల్లర్లు కొనుగోలు చేయని పక్షంలో వారిపై చర్యలు ఉంటాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మేడేపల్లిలో సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఒక కేంద్రం నుంచి మరో కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తేమ శాతం వచ్చినా కాటాలు వేసి లోడ్ చేయడం లేదని చెప్పారు. దీనికి అధికారులు స్పందిస్తూ సత్యసాయి రైస్ మిల్లర్ ధాన్యం తీసుకోవడం లేదని కలెక్టర్‌కు వివరించారు. 1638 కూనవరం సాంబ రకం వడ్లు తీసుకోమని చెబుతున్నారని, దీనిపై సివిల్ సప్లై అధికారులతో మాట్లాడగా.. సమస్య మా దృష్టికి వచ్చిందని, మిల్లర్‌తో మాట్లాడుతున్నామని చెప్పారు. రైతులు ఇబ్బంది పడుతుంటే మిల్లర్‌తో చర్చలు ఏమిటి? రేపటిలోగా తీసుకోకుంటే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఐకేపీ కేంద్రంలో 5 కేజీల తరుగు తీస్తేనే ధాన్యం తీసుకుంటామని అంటున్నారని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని పలుమార్లు సమావేశాలు నిర్వహించినా నిర్వహణ సరిగా లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. మీటింగ్‌లు తమాషా కోసం కాదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులెవరూ అధైర్యపడొద్దని, కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎలిజబెత్, ఏవో వేణు, ఆర్ఐ వహీద తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ సైనికులు దండుకట్టాలి

**సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్**



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

కారేపల్లి, ఏప్రిల్ 22: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా కదలిరావాలని మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రజతోత్సవ సభ సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గులాబీ సైనికులు దండులా కదలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఆ పార్టీ నాయకులు పదవులను కాపాడుకునేందుకే సమయం అంతా వృథా చేస్తున్నారని విమర్శించారు. అనంతరం సభకు నాయకులు, కార్యకర్తలను తరలించే బస్సు ఇన్‌చార్జిలతో సమావేశమై పలు సలహాలు సూచనలు చేశారు. కార్యకర్తలు ప్రజలు, అభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నం వీరేందర్, వాంకుడోత్ జగన్, హన్మకొండ రమేశ్, జడల వెంకటేశ్వర్లు, ఎస్కే గౌసుద్దీన్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ జాతరకు తరలిరావాలి

**జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు**



ప్రచారం నిర్వహిస్తున్న లింగాల కమల్‌రాజు

మధిర, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు జాతరలా తరలిరావాలని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కోరుతూ మధిర మున్సిపాలిటీ పరిధిలోని 8, 19, 20 వార్డుల్లో బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు, వేముల శ్రీనివాసరావు, ఆవుల నాగేశ్వరరావు, పరస శ్రీనివాసరావు, వేల్పుల శివ, లంకెమల్ల నాగేశ్వరరావు, చీదిరాల రాంబాబు, బొల్లెపల్లి హనుమంతరావు, షేక్ జాన్‌సైదా, శంకరశెట్టి కామేశ్వరరావు, ఆరుద్ర కొండ, ఆవుల గోపి, ఆవుల నరేంద్ర, షేక్ ఖాసీం, ఆరుద్ర కోటేశ్వరరావు, అల్లాడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు సత్వర పరిష్కారం: భద్రాద్రి కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 22: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన చట్టం 'భూ భారతి'తో రైతుల సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ స్పష్టం చేశారు. మంగళవారం అన్నపురెడ్డిపల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ భారతితో భూములకు సంబంధించిన వివాదాలు, రికార్డుల్లో లోపాలు, నకిలీ పత్రాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపవచ్చన్నారు. ఆధార్ నెంబర్ ఉన్నట్లు భూదార్ నెంబర్లు భూమికి ఉండాలన్నదే పోర్టల్ లక్ష్యమన్నారు. సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏడీఏ రవికుమార్, ఏవో అనూష, సీఐ ఇంద్రసేనా రెడ్డి, రైతులు పాల్గొన్నారు.






# పాస్ పర్సంటేజీ అప్

- ఇంటర్ ఫస్టియర్‌లో 71.15 శాతంతో మూడో స్థానం
- సెకండియర్‌లో 77.69 శాతంతో ఐదో స్థానం
- ప్రథమ, ద్వితీయంలోనూ బాలుర కంటే బాలికలదే పైచేయి
- రాష్ట్రస్థాయిలో ఖమ్మం జిల్లా విద్యార్థులకు ఉత్తమ మార్కులు

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 22: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఖమ్మం జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలను నమోదు చేశారు. మంగళవారం విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో పాస్ పర్సంటేజీ పెరిగింది. ప్రథమ సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో జనరల్ విభాగంలో ఖమ్మం జిల్లా మూడో స్థానంలోనూ, ద్వితీయ సంవత్సరంలో ఐదో స్థానంలో నిలిచింది. గతంతో పోలిస్తే ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత 3 శాతం, ప్రథమ సంవత్సరంలో 8 శాతం శాతం పెరిగింది. అనేక ఏళ్లుగా అద్భుత ఫలితాలను సాధిస్తూ జిల్లా విద్యార్థులు ఈ ఏడాది కూడా అదే ఒరవడిని కొనసాగించారు. ఫస్టియర్, సెకండియర్‌లలో జిల్లాకు మెరుగైన స్థానం దక్కింది. ఎప్పటిలాగానే బాలికలే తమ హవాను కొనసాగించారు. రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో సైతం బాలురతోపాటు బాలికలు మెరుగైన ప్రతిభ కనబర్చారు. ఫస్టియర్‌లో జిల్లా ఉత్తీర్ణత శాతం 71.15 కాగా అందులో బాలికలు 77.89 శాతం ఉత్తీర్ణతశాతం సాధించారు. బాలురు 64.51 శాతంతో సరిపెట్టుకున్నారు. సెకండియర్‌లో జిల్లా ఉత్తీర్ణత శాతం 77.69 శాతం కాగా.. అందులో బాలికలు 83.13 శాతం, బాలురు 72.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ వివరాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి కే.రవిబాబు వెల్లడించారు.

### ఫస్టియర్‌లో..

ఇంటర్ ఫస్టియర్ (జనరల్) ఫలితాల్లో 71.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, సాంఘిక సంక్షేమ కళాశాలల్లో 15,584 మంది విద్యార్థులకుగాను 11,088 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 7,851 మందికిగాను 5,065 మంది; బాలికలు 7,733 మందికిగాను 6,023 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో 2,253 మందికిగాను 1,388 మంది ఉత్తీర్ణులయ్యారు. 61.61 శాతం ఉత్తీర్ణత సాధించారు.

### సెకండియర్‌లో..

ఇంటర్ సెకండియర్ (జనరల్) ఫలితాల్లో 14,876 మంది విద్యార్థులకుగాను 11,557 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 77.69 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 7,346 మందికిగాను 5,297 మంది పాసై 72.10 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. బాలికల్లో 7,530 మందికిగాను 6,260 మంది పాసై 83.13 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఖమ్మం జిల్లా ఐదో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇక ఒకేషనల్ విభాగంలో 2,043 మందికిగాను 1,439 మంది ఉత్తీర్ణులయ్యారు. 70.44 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

### గురుకులాలు, కేజీబీవీల్లో..

- జోనల్ పరిధిలోని గురుకులాల్లో ఫస్టియర్‌లో 1,467 మందికిగాను 1,109 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 1,460 మందికిగాను 1,279 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ వివరాలను జోనల్ ఆఫీసర్ స్వరూపరాణి తెలిపారు.
- కేజీబీవీల్లో ఫస్టియర్‌లో 709 మందికిగాను 557 మంది పాసై 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 661 మందికిగాను 584 మంది పాసై 88 శాతం సాధించారు. ఈ వివరాలను జీఈసీవో తులసి వెల్లడించారు.

### గత సంవత్సరాల ఫలితాలతో పోల్చితే..

**ఇంటర్ ప్రథమ సంవత్సరం**

| సంవత్సరం | బాలుర శాతం | బాలికల శాతం | ఉత్తీర్ణత శాతం | రాష్ట్రస్థాయి స్థానం |
|---|---|---|---|---|
| 2022 | 61.00 | 76.00 | 69.00 | 6వ స్థానం |
| 2023 | 62.00 | 72.00 | 67.00 | 7వ స్థానం |
| 2024 | 55.85 | 71.93 | 63.84 | 4వ స్థానం |
| 2025 | 64.51 | 77.89 | 71.15 | 3వ స్థానం |


**ఇంటర్ ద్వితీయ సంవత్సరం**

| సంవత్సరం | బాలుర శాతం | బాలికల శాతం | ఉత్తీర్ణత శాతం | రాష్ట్రస్థాయి స్థానం |
|---|---|---|---|---|
| 2022 | 64.00 | 78.00 | 71.00 | 7వ స్థానం |
| 2023 | 68.00 | 80.00 | 74.00 | 4వ స్థానం |
| 2024 | 67.77 | 80.44 | 74.20 | 5వ స్థానం |
| 2025 | 72.10 | 83.13 | 77.69 | 5వ స్థానం |

## భద్రాద్రి జిల్లాకు రాష్ట్రస్థాయి 9వ స్థానం

**ఫస్టియర్‌లో 65.96 శాతం, సెకండియర్‌లో 65.65 శాతం ఉత్తీర్ణత**

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఏప్రిల్ 22:ఇంటర్ ఫలితాల్లో భద్రాద్రి జిల్లా విద్యార్థులు మొదటి సంవత్సరంలో 65.96 శాతం, ద్వితీయ సంవత్సరంలో 65.65 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. ఫస్టియర్ జనరల్ విభాగంలో మొత్తం 3,028 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,570 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలికలు 4,184 మంది పరీక్షలు రాయగా 2,944 మంది పాసయ్యారు. ఒకేషనల్ విభాగంలో 860 మందికిగాను 402 మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. 1,179 మంది బాలికలకుగాను 863 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం ఫస్టియర్‌లో 3,888 మంది బాలురు పరీక్ష రాయగా 1,973 మంది ఉత్తీర్ణత సాధించారు. 5,366 మంది బాలికలు పరీక్షలు రాయగా 3,807 మంది ఉత్తీర్ణత నమోదు చేశారు. సెకండియర్ జనరల్ విభాగంలో మొత్తం 2,996 మంది బాలురు పరీక్ష రాయగా 1,855 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 4,083 బాలికలు పరీక్షలు రాయగా 3,190 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్‌లో 763 మంది బాలురకుగాను 495 మంది ఉత్తీర్ణులయ్యారు. 1024 మంది బాలికలకుగాను 882 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 7,079 మంది పరీక్షలు రాయగా 5,045 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,787 మంది పరీక్షలు రాయగా 1,377 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో జనరల్ విభాగంలో భద్రాద్రి జిల్లా 9వ స్థానంలో, ఒకేషనల్‌లో 10వ స్థానంలో నిలిచింది. ఈ నెల 23 నుంచి 30 వరకూ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, జూన్ 3 నుంచి 6 వరకు పరీక్షలు ఉంటాయని డీఐఈవో తెలిపారు.






# అధికార పార్టీ నాయకులకే ఇళ్లా?

- ఎంపికలో తమకు అన్యాయం జరిగిందంటూ ఆగ్రహం
- జాబితాలో పేరు లేకపోవడంపై మద్దుకూరు గ్రామస్తుల నిరసన



మద్దుకూరు గ్రామంలో రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, మహిళలు

చండ్రుగొండ, ఏప్రిల్ 22: నిరుపేదలమైన తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయకుండా అధికార పార్టీ నాయకులకే మంజూరు చేశారని ఆరోపిస్తూ చండ్రుగొండ మండలం మద్దుకూరు గ్రామానికి చెందిన నిరుపేదలు రోడ్డెక్కి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు, మహిళలు మాట్లాడుతూ గ్రామంలో 42 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే.. అందులో అనర్హులనే ఎక్కువగా ఎంపిక చేశారన్నారు. జాబితాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. ఇళ్లు లేని నిరుపేదలను ఏమాత్రం పట్టించుకోలేదని, ఇందిరమ్మ కమిటీలు కూడా తమకు అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులమైన తమకు ఇళ్లు మంజూరు చేయకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాయల దుర్గ, రాజమ్మ, పద్దం జయ, చెందిలి మరియమ్మ, కాంపాటి మౌనిక, సునీత, విజయలక్ష్మి, కవిత, శారద, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

